## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రవాసాంధ్రులు జన్మభూమికి చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ భారతదేశ సముద్ర శాస్త్ర ప్రయాణంలో నూతన అధ్యాయానికి ఆరంభమని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.
- రాష్ట్ర అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు.
- మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి నారాయణ కమిషనర్లను ఆదేశించారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు జీజీహెచ్ లో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ కాలేజీలో చదువుకొని విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు జింఖానా సంస్థను ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున సాయం చేయడం గొప్ప విషయమన్నారు. ఎంత ఎదిగినా జన్మభూమిని మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ధనిక, పేదల మధ్య వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయని, అందుకే పేదల అభ్యున్నతి కోసం పీ4 తీసుకొచ్చామని చెప్పారు. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయని, పీ4 కార్యక్రమం లక్ష్య సాధనలో 50 శాతం రీచ్ అయ్యామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

కాగా.. కళాశాల పూర్వ విద్యార్థులు కానూరి-జింఖానా మాతా శిశు సంరక్షణ కేంద్రం కోసం 100 కోట్ల రూపాయల నిధులు సమకూర్చగా.. పరికరాలు, ఫర్నిచర్ కోసం ప్రభుత్వం 27 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.

====================

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీకి చెందిన ఒక కొత్త భవనం ప్రారంభోత్సవం మాత్రమే కాదని, భారతదేశ సముద్ర శాస్త్ర ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి ఆరంభమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖలోని ఋషికొండ వద్ద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ నూతన ప్రాంతీయ కేంద్ర భవనాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి అనిత, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌కు మరో ముఖ్యమైన మైలురాయి వంటిదని, సుమారు 5 దశాబ్దాలుగా ఈ కేంద్రం దేశానికి సేవలందిస్తోందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో సాగరమాల, బ్లూ ఎకానమీ, లోతైన సముద్ర అన్వేషణ, తీర మౌలిక వసతుల అభివృద్ధి వంటి కార్యక్రమాల ద్వారా సముద్రాలపై దృష్టి పెట్టారని మంత్రి అనిత పేర్కొన్నారు.

====================

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోను ఉన్నత స్థానంలో నిలపాలన్నదే తన లక్ష్యమని విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. కాకినాడ జేఎన్టీయూకేలో "హలో లోకేష్" పేరిట నిర్వహించిన 'ముఖాముఖి' కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన

ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. రాష్ట్ర అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ, వారి భవిష్యత్తును అత్యున్నతంగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. పాదయాత్ర ద్వారా రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలు, సమస్యలను తెలుసుకునే అవకాశం లభించిందని వివరించారు.

====================

విద్యతో పాటు విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. డీఎస్సీ ద్వారా అంబేద్కర్ గురుకులాల్లో నియమితులైన టిజిటి, పిఈటీలకు ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. అలాగే విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతపై స్వచ్ఛ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీబాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యార్థులకు గార్డియన్లుగా వ్యవహరించాలన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు.

====================

విరామం

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు గుడిపల్లి మండలంలో ఆగస్త్య విద్యాచల్ అకాడెమీ ప్రాంగణంలోని టీచర్ల ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించారు. 3 కోట్ల రూపాయల వ్యయంతో 11 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ లో సంవత్సరానికి
5 వేల మంది టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శిక్షణా కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అకాడెమీ ప్రాంగణంలోనే లెర్నర్స్ అకామిడేషన్ ఫెసిలిటీ సెంటర్ కు శంకుస్థాపన చేశారు. ఇదే ప్రాంగణంలో 2 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఒబెరాయ్ విజిటర్స్ సెంటర్ కు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

====================

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి నారాయణ కమిషనర్లను ఆదేశించారు. అనంతపురంలో జరుగుతున్న మున్సిపల్ కమిషనర్ల ప్రాంతీయ సదస్సులో మంత్రి అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందిస్తున్నామని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణానికి అమృత్ తో పాటు వివిధ పథకాల ద్వారా పనులు చేపడుతున్నామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్…30 సెకన్లు)

====================

ఎన్డియే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, 600 మందికి పైగా కారుణ్య నియామకాలను చేపట్టామని రాష్ట్ర ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఈరోజు ఆయన అమరావతిలో 27 మందికి ఏపీ జెన్కో పరిధిలో కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు కారుణ్య నియామకాలతో ప్రభుత్వం భరోసా ఇస్తోందని, చదువుకు తగిన ఉద్యోగాలు ఇచ్చి వారి సేవలను విద్యుత్ శాఖ వినియోగించుకుంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో వయసు సడలింపు ఇచ్చి బాధిత కుటుంబాలను ఆదుకుంటున్నామని, ప్రతి మూడు నెలలకు ఒకసారి కారుణ్య నియామకాలు చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జూనియర్ ఇంజనీర్ ఉద్యోగాలు కూడా ఇస్తున్నామని చెప్పారు.

====================

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సోమశిల జలాశయాన్ని 100 కోట్ల రూపాయలతో ఆధునికరిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. అనంతసాగరం మండలం సోమశిలలో ఈరోజు జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో వచ్చిన భారీ వరదల వల్ల జలాశయం పూర్తిగా దెబ్బతిందని అన్నారు. దీనికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని, త్వరలోనే టెండర్లు పిలుస్తామని చెప్పారు. అదేవిధంగా సోమశిల హై లెవెల్ కెనాల్ పనులు కూడా త్వరలోనే ప్రారంభించి, మెట్ట ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందిస్తామని మంత్రి తెలిపారు.

=====================

కడప–రాయచోటి రహదారిని నాలుగు లేన్‌ల రోడ్డుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాం ప్రసాదరెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రహదారి అభివృద్ధిపై న్యూఢిల్లీలోని ట్రాన్స్‌పోర్ట్ భవన్ లో కేంద్ర రవాణా ఉన్నత అధికారులతో ఆయన ఈరోజు సమావేశమయ్యారు.

=====================

=====================